
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

గురువారం 6 జూన్ 2024



బస్సు ఢీకొని బాలుడి మృతి 7లో..

నత్తనడకన అమ్మ ఆదర్శ పాఠశాల పనులు 8లో..


# పెట్టుబడి భారం



- రైతన్నకు యేటా పెరుగుతున్న ఖర్చులు
- ట్రాక్టర్, నాగళ్ల అద్దె పెంపు
- అధికమవుతున్న కూలీ ఖర్చులు
- పెరిగిన ఎరువుల ధరలు

జగిత్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు ప్రతి యేటా పెట్టుబడి భారంగా మారుతోంది. ట్రాక్టర్లు, యంత్రాల అద్దెలు, వ్యవసాయ కూలీలు, ఎరువుల ధరలు పెరిగాయి. ఇంధనం ధరలు పెరుగుతుండడమే ఇందుకు ప్రధాన కారణంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయం అదనంగా వస్తున్న ఖర్చులకే సరిపోతుందని.గత యేడాది కంటే ఈ సారి ఎకరాలకు రూ. 5 వేల వరకు అదనపు భారం పడనుందని రైతన్నలు వాపోతున్నారు. జిల్లాలో అత్యధికంగా రైతులు కాలువలు, చెరువులు, కుంటలు, బోరు బావులు, వర్షాలపై ఆదారపడి ప్రధానంగా వరి సాగు చేస్తుంటారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుతో పాటు వివిధ రిజర్వాయర్ల కింద భూములున్న రైతులు ఈ సారి సైతం సాగు నీరు విడుదల చేస్తారన్న ఆశతో వరి సాగుకు సిద్ధమయ్యారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతాల్లో అత్యధికంగా వరి సాగు చేస్తుండగా, మిగిలిన ప్రాంతాల్లో మొక్కజొన్న, పత్తి, చెరుకు, పసుపు, కంది, పెసర తదితర పంటలపై రైతులు దృష్టి సారించారు.

### వానాకాలం సీజన్‌లో 4.24 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లా వ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణం కంటే అధికంగా వానాకాలంలో పంటల సాగు అవుతుందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో సుమారు 1.60 లక్షల మంది రైతులున్నారు. జిల్లా వ్యాప్తం గా పంటలు సాధారణ సాగు విస్తీర్ణం 3,35,978 ఎకరాలు కాగా ఈ సీజన్‌లో 4,24,425 ఎకరాలు సాగు చేస్తారని అంచనా వేశారు. మండలాల్లోని క్లస్టర్ల వారీగా సాగు విస్తీర్ణం అంచనాలను వ్యవసాయ అధికారులు రూపొందించారు.ఇందులో ప్రధానంగా వరి 3,05,000 ఎకరాలు, మొక్కజొన్న 41,000 ఎకరాలు, కందులు 2,500, పెసర్లు 150, ఇతర పప్పులు 675, సోయా చిక్కుడు 600, పత్తి 20,200, చెరుకు 1,200 ఎకరాలు, పసుపు 11,000, ఇతర పంటలు 42,100 ఎకరాల్లో సాగు కానున్నట్లు అధికారులు అంచనా వేశారు.

### ఇంధన ధరలు పెరుగుతుండడంతో...

ఇంధన ధరలు తరచూ పెరుగుండడంతో ట్రాక్టర్, ఇతర వ్యవసాయ యంత్రాల అద్దెలను యజమానులు పెంచుతున్నారు. గత యేడాది వానాకాలంలో పొలం దున్నేందుకు ట్రాక్టర్ అద్దె గంటకు రూ. 1,200 ఉండగా...ఈ సారి రూ. 1,500కు పెంచారు. తొమ్మిద నాగళ్ల కల్టివేటర్ రూ. 1,000 వరకు చెల్లిస్తున్నారు. అలాగే కూలి ధరలు, కూలీల తరలింపుకు రవాణా చార్జీలు అదనపు భారంగా మారాయని అన్నదాతలు వాపోతున్నారు. గత యేడాది మగ కూలీలకు రూ. 800 వరకు ఉండగా ప్రస్తుతం రూ. 900 కూలి, మహిళకు రూ. 400 వరకు ఉంటుంది.

### పెరిగిన ఎరువుల ధరలు

గత యేడాదితో పోలిస్తే ప్రస్తుత యేడాది ఎరువుల ధరలు పెరిగాయి. డీఏపీ రూ. 1,250 నుంచి 1,600 వరకు పెరిగింది. అదే విధంగా 20-20-0-13 ఎరువు రూ. 950 నుంచి రూ. 1,200కు, 28-28-0 ఎరువు రూ. 1,275 నుంచి రూ. 1,500కు, పొటాష్ రూ. 850 నుంచి రూ. 1,200కు పెరిగాయి.

### సాగు భారవమవుతోంది..



**కొమ్ము కుమార్, రైతు, బట్టపల్లి**

రోజురోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక పోవడంతో సాగు భారంగా మారుతోంది. కనీసం పెట్టుబడి అయినా చేతికందితేచాలన్న పరిస్థితిలో పంటలు సాగు చేస్తున్నాం. ప్రకృతి అనుకూలిస్తేనే పంట చేతికొచ్చే అవకాశం ఉంది. లేదంటే అప్పులే మిగులుతాయి.

### మద్దతు ధర చెల్లించాలి



**కొక్కు గంగారాం, రైతు, సారంగాపూర్**

పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలి. గిట్టుబాటు ధర చెల్లిస్తేనే పెట్టుబడులు చేతికందే అవకాశం ఉంది. ప్రతి సంవత్సరం పెరుగుతున్న ఖర్చులతో పెట్టుబడి భారంగా మారుతోంది. ప్రభుత్వమే ప్రోత్సాహం అందించాలి. రైతులకు సాగు భారం కాకుండా సర్కారు చర్యలు తీసుకోవాలి.

## కోరుట్ల మున్సిపాలిటీకి గ్రీన్ చాంపియన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ తిరుపతి

కోరుట్ల, జూన్ 5: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రీన్ చాంపియన్ అవార్డును బుధవారం మున్సిపల్ కమిషనర్ తిరుపతి అందుకున్నారు. హైదరాబాదులోని పర్యావరణ శాఖ కార్యాలయంలో ఐఏఎస్, ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిప్రసాద్ చేతుల మీదుగా అవార్డును కమిషనర్ తిరుపతి అందుకున్నారు. టీజీపీసీబీ గ్రీన్ చాంపియన్ అవార్డును అందుకున్న తిరుపతిని పర్యావరణ శాఖ అధికారులు అభినందించి సన్మానించారు. అవార్డు ఎంపికకు దోహదపడిన మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో పాటు పట్టణ ప్రజలకు మున్సిపల్ చైర్మెన్ అన్నం లావణ్య - అనిల్, కమిషనర్ తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు.

## చెట్లను కాపాడితే భావితరాలను కాపాడినట్టే

- మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి ప్రసాద్



మెట్‌పల్లిలోని కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న మెజిస్ట్రేట్ ప్రసాద్

మెట్‌పల్లి, జూన్, 5: చెట్లను కాపాడితే భావితరాలను కాపాడినట్టేనని మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మోహన్‌లు అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మెట్‌పల్లి కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి జడ్జి, మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సిబ్బందితో కలిసి మొక్కలను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను కాపాడాలన్నారు. వాతావరణంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో తట్టుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. భావితరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం, చెట్లను సంరక్షించడం అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ఉపాధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, న్యాయవాదులు మగ్గిడి వెంకటనర్సయ్య, వడ్డేపల్లి శ్రీనివాస్, హఫీజ్, స్రవంతి, వెంకటేశ్వర్లు, భానుమూర్తి, శేఖర్, జగన్, శంకర్‌రెడ్డి, ప్రవీణ్, శేషు, మున్సిపల్ మేనేజర్ వెంకటలక్ష్మీ, ఏఈ అరుణ్‌కుమార్, ఆర్వో ఉమాదేవి, ఆర్ఐ అక్షయ్, టీవో నరేష్, రత్నాకర్, విష్ణు, ముజీబ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో..

# పెద్దల బీసీజీ టీకాతో టీబీ నిర్మూలన



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్



హాజరైన వైద్య సిబ్బంది

జగిత్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పెద్దల బీసీజీ టీకాతో టీబీ వ్యాధి పూర్తి నిర్మూలన సాధ్యమవుతుందని, బీసీజీ టీకాపై అధ్యయానికి రాష్ట్ర వ్యాప్తంగా 17 జిల్లాలను ఎంపిక చేయగా జగిత్యాల జిల్లా ఎంపికకావడం జరిగిందని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నీలారపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో జిల్లాలోని వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందికి బీసీజీ టీకాపై అవగాహణ, శిక్షణ, అధ్యయనం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిబంధన మేరకు గుర్తించిన వారికే బీసీజీ టీకా వేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి మండలంలో ఇంటింటి సర్వే నిర్వహించి బీసీజీ టీకా లబ్ధిదారులను గుర్తిస్తామన్నారు. జిల్లా స్థాయిలో శిక్షణ అనంతరం మండల స్థాయిలో వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఉంటాయని తెలిపారు. కాగా బీసీజీ టీకా ఉపయోగాలు, నిర్వహణ తదితర అంశాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు డాక్టర్ విష్ణు, ఆదిత్య, అతుల్ నగిమే, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సమీయోద్దిన్, డాక్టర్ ఆకుల శ్రీనివాస్, డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి, జిల్లాలోని వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి

పెగడపల్లి, జూన్ 5 : పాఠశాలల్లో మరమ్మత్తు పనులు, నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా పెగడపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో చేపట్టిన పనులను బుధవారం ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రారంభంలోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, ప్రిన్సిపాల్ సుంకరి రవి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



మోడల్ స్కూల్‌లో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

## పేద ప్రజల కోసం కార్పొరేట్ వైద్యం

ధర్మపురి, జూన్ 5: పేద ప్రజల కోసం ప్రభుత్వం కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ధర్మపురి మండలంలోని దొంతాపూర్ గ్రామానికి చెందిన గజ్జెల రాజేష్ అనారోగ్యంతో భాధపడుతుండగా హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స నిమిత్తం రూ 2.10 లక్షల ఎల్‌వోసీని గురువారం ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సందర్భాల్లో అనారోగ్యానికి గురై ప్రమాదాల బారిన పడిన వ్యక్తులకు ఎల్‌వోసీ అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఎల్‌వోసీని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సర్దా లక్ష్మణ్, ముత్యపు గంగారాం, దాసరి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని ప్లాట్లను విక్రయించరాదు

కోరుట్ల, జూన్ 5: ప్రభుత్వ అనుమతి లేని ప్లాట్లను విక్రయించరాదని విక్రయించిన వారికి మున్సిపల్‌లో అనుమతి దొరకదని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ తిరుపతి బుధవారం తెలిపారు. పట్టణంలోని సర్వే నంబర్ 790, 791, 792, 794లోని ప్లాట్లను ప్రజలు కొనుగోలు చేయ వద్దని, ప్రభుత్వ అనుమతి లేకుండా ప్లాట్లుగా ఏర్పాటు చేసి విక్రయిస్తూ కొనుగోలుదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పురపాలక సంఘం ద్వారా ఎటువంటి మౌలిక వసుతులకు సంబంధించిన అభివృద్ధి పనులు చేయరని తెలిపారు. ఈ సర్వే నెంబర్లలో రిజిస్ట్రేషన్‌కు అనుమతిచవద్దని సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ పంపుతున్నట్లు తెలిపారు. ప్రజలు సహకారం అందించాలని కోరారు.

## నేడు ధర్మపురి మండల సమావేశం

ధర్మపురి, జూన్ 5: ధర్మపురి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 6న గురువారం ఉదయం 10.30 గంటలకు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు అధ్యక్షతన నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి మండల పరిధిలో గల ఎంపీటీసీలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

## సామాజిక తనిఖీ ప్రజావేదిక

జగిత్యాలరూరల్, జూన్ : జగిత్యాల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 14 విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. దీనిలో భాగంగా అన్ని గ్రామాల వారీగా నివేదికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ సంపత్‌రావు, డీబీఓ చిన్నయ్య, ఎంపీడీఓ విజయలక్ష్మీ, ఏపీఓ దయాకర్, పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



హాజరైన అధికారులు

జగిత్యాల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న జిల్లాలో జరగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా , కమిషన్ నిబంధనల మేరకు నిర్వహించాలని జగిత్యాల కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం చీఫ్ సూపరిండెంట్లు, ఇన్విజిలేటర్‌లు, పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 22 కేంద్రాల్లో 7,692 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారన్నారు. పరీక్ష హాలులోకి ఉదయం 9గంటలకు నిశిత పరిశీలన చేస్తూ పంపించడం జరుగుతుందని, ఉదయం 10గంటలకు మెయిన్ ద్వారం మూసివేసి, అభ్యర్థులకు బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకుంటారన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఆయా బాధ్యులు విధులు కమిషన్ నిబంధనల మేరకు నిర్వహించాలని సూచించారు. అభ్యర్థులు చేయదగినవి, చేయకూడనివి ప్రతి కేంద్రంలో ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు సౌకర్యార్థం ముందస్తుగా సమయానికి బస్సులు నడిచే విధంగా అన్ని ఏర్పాట్లు ఆర్టీసీ చేస్తుందని, పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో మెడికల్ టీంలు ఏర్పాటు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. నిర్ణీత సమయంలో క్వశ్చన్ పేపర్, ఓఎంఆర్ షీట్లు పంపిణీ చేయాలని, పరీక్ష కేంద్రంలోకి ఏ వాహనాన్ని అనుమతించకుండా బయటే పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందన్నారు. సెల్‌ఫోన్‌లు, గాడ్జెట్లు అనుమతించరన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, అదనపు ఎస్పీ వినోద్‌కుమార్, రీజనల్ కో ఆర్డినేటర్ వేణుగోపాల్, కలెక్టరేట్ ఏవో విశ్వంభర్ తదితరులున్నారు.


**CHANGE OF NAME**

I, ALVALA SHANKAR S/o. ALVALA NARAYANA R/O: H.NO: 4-6-91, Tenugu wada, JAGTIAL Town/mandal, JAGTIAL Dist (T.s) shall hence forth be known as ALUWALA SHANKAR / S/o. ALUWALA NARAYANA

**ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ పోయినవి**

Medipalli Manohar S/o. Jaladri R/o. H.No 3-53, Vill : Balwanthapur, Mdl : Mallial, Dist : Jagitial, (T.S). గారికి సంబంధించిన నెం. 364/2014 గల ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్, బల్వంతాపూర్ నుండి మల్యాలకు వెళ్ళె మార్గ మధ్యలో ఎక్కడో పడిపోయినది. దొరికిన వారు సం.డి. సెల్: 80086 04102


# దేవుడిని ముందు పెట్టి ఓట్లడిగారు

- నా అనుభవాన్ని పార్టీ, ప్రజాశ్రేయస్సుకు వినియోగిస్తా
- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, జూన్ 5: బీజేపీ నాయకులు దేవుడిని ముందుపెట్టి ఓట్లు అడిగారని, తన స్థానికత అంశం జగిత్యాల జిల్లాలో చిన్నదైపోయి, వాటిముందు నిలవలేకపోయిందని భావిస్తున్నానని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాలలో ఇందిరాభవన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేవుడి ముందు పెట్టి ఓట్లు అడిగారని ఆయన ముందు నేనెంత, అందుకే తలవంచాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. బీజేపీ పార్టీ రాజకీయ లబ్ధికొరకు విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందన్నారు. ఆప్‌కీ బార్ చార్ సౌ అనే నినాదంతో ముందుకెళ్లిన బీజేపీకి, స్వల్ప వ్యవధిలోనే గత మెజార్టీని తగ్గించేలా ఇండియా కూటమి పావులు కదిపిందని, కాంగ్రెస్‌కు సైతం సీట్లు పెరిగాయని గుర్తు చేశారు. ఉత్తరప్రదేశ్, వారణాసి లాంటి ప్రాంతాల్లో సైతం మోదీ విధానాలు, అర్భాటాలను ప్రజలు జీర్ణించుకోలేకపోయారన్నారు. తానే ఒక దైవదూతనంటూ మోదీ ప్రకటించుకోవడంతో ఉత్తర భారతదేశ ప్రజలు మోదీ వైఖరిని హర్షించలేకపోయారన్నారు. డిల్లీకి చేరువలో ఉన్న పంజాబ్, హర్యాన రాష్ట్రాల్లో సైతం బీజేపీ ప్రభావం తగ్గిందన్నారు. తెలంగాణలో శత్రువుకు శత్రువు మిత్రుడు అన్నట్లుగా బీఆర్ఎస్ పార్టీ, బీజేపీకి అండగా నిలిచిందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో త్రిముఖ పోరుగా ఉన్నట్లుగా కనిపించిన, చివరికి కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మారిందన్నారు. జగిత్యాల నియోజకవర్గంలోని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ స్వగ్రామమైన అంతర్గాంలో కాంగ్రెస్‌కు లీడ్ వచ్చిందన్నారు. అదే స్ఫూర్తితో ఎమ్మెల్యే నియోజకవర్గం మొత్తం బీఆర్ఎస్‌కు ఓట్లేయించే ప్రయత్నిస్తే బీజేపీకి ఓట్లు డైవర్ట్ కాకుండా పోయేదన్నారు. అర్వింద్ సొంత గడ్డపై కాంగ్రెస్‌కు 16వేల మెజార్టీ వచ్చిందన్నారు. రైతాంగం కోసం నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిచేలా కార్యరూపం దాల్చేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించామన్నారు. గల్ఫ్ కార్మికులు, బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం, గల్ఫ్ వెల్ఫేర్ బోర్డు, అర్హులందరికీ పెన్షన్ అందేలా చూడడం తన బాధ్యతగా భావిస్తున్నామన్నారు. విద్యాసంస్థల్లో ఫీజుల భారం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ఫీజుల నియంత్రణ చట్టం తెచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఒక ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఉన్నత వర్గాలకు ప్రతినిధిగా భావించడం దురదృష్టకరం అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లో ఉన్నత వర్గాలే తప్ప ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు అందులో అవకాశం కల్పించకపోవడం చూస్తే మోదీ వైఖరి స్పష్టం అవుతుందన్నారు. రాహుల్‌గాంధీ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి పార్లమెంట్‌లో చర్చకు తెరలేపే దిశగా ప్రయత్నిస్తామన్నారు. తన అనుభవాన్ని పార్టీకి, ప్రజా సంక్షేమానికి కేటాయిస్తానన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, రూరల్ ఎంపీపీ మహేష్, టీపీసీసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బండ శంకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త మోహన్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య, నాయకులు బండ భాస్కర్ రెడ్డి, గుంటి జగదీశ్వర్, రాధాకిషన్‌రావు తదితరులున్నారు.

## పిచ్చి కుక్క స్వైర విహారం

- ఏడుగురిపై దాడి

వెల్గటూర్, జూన్ 5: వెల్గటూర్ మండల కేంద్రంలో బుధవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. రోడ్డున పోయే వారిని కరిచి భయభ్రాంతులకు గురిచేసింది. ఒకే రోజు ఏడుగురిని కరవడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. వేసవి కావడంతో చిన్నారులు ఆరు బయట ఆడుకుంటుంటే ఎక్కడ పిచ్చి కుక్క కరుస్తుందోనని భయాందోళనకు గురయ్యారు. కుక్క కాటుకు గురైన వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు.

## పిడుగుపాటుతో రైతు మృతి

భీమారం, జూలై 5: భీమారం మండలంలోని వెంకట్రావుపేటలో బుధవారం సాయంత్రం కొంగ గంగనర్సయ్య(46) అనే రైతు పొలంలో పనిచేస్తుండగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెళ్లి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. గంగనర్సయ్యకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

## విద్యుదాఘాతంతో గొర్రె మృతి

బీర్‌పూర్,జూన్ 5: బీర్‌పూర్ మండల కేంద్రంలోని పెద్దగుట్ట సమీపంలో గల నేరెళ్ల నరేష్ పత్తి చేనులో 11కేవీ విద్యుత్ వైరు తెగిపడింది. బుధవారం గుట్ట ప్రాంతానికి గొర్రెల మందను మేపడం కోసం వెళ్లిన సంపంగి నరేష్‌కు చెందిన గొర్రె తెగిపోయి ఉన్న విద్యుత్ వైరుకు తగిలి మృతి చెందింది. మృతి చెందిన గొర్రె విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందని, తనను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితుడు కోరారు. లైన్‌మన్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.


ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ I, ADDIKA SRINU, S/O. ADDIKA MURALI, R/O. H.NO.1-71, CHEKKAPALLY, VEMULAWADA, RAJANNA SIRICILLA. HAVE CHANGED MY NAME AS " ADDIKA SRINIVAS REDDY " S/O. ADDIKA MURALI.

AJK-15521

**CHANGE OF NAME**

★ I, SAMALA SANTHOSH, S/O. SAMALA MALLAIAH, R/O. H.NO.2-91, PENCHAKAL PETA, ELKATHURTHY, HANMAKONDA. HAVE CHANGED MY NAME AS " SAMALA SANTHOSH REDDY " S/O. SAMALA MALLA REDDY.

AJK-15520

3+2 స్కీం కలదు

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 99854 10640

జగిత్యాల :- సెల్: 99854 11262

మెట్‌పల్లి :- సెల్: 70131 42966

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

పెద్దపల్లి :- 95509 00238

# నీట్ ఫలితాల్లో 'అల్ఫోర్స్' విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ టౌన్, జూన్ 5: నీట్-24 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత మార్కులతో జయకేతనం ఎగురవేశారని అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని అల్ఫోర్స్ కళాశాలలో నీట్‌లో అత్యు త్త మ మా ర్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సంద ర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నీట్‌లో ఎస్. హేమంత్ 691 మార్కులు, వి.హాసిని 671, డి.పూజిత 650, ఎస్.కౌశిక్ రెడ్డి 647, పి.అక్షర రెడ్డి 639, వి.శ్రీముఖి 619, మరియాసభ 619, ఏ.శ్రీవర్ధిని 613, ఎం.కమాలికా ప్రీతి 613, ఎస్.జ్ఞానద 604, ఎ.అమరేందర్ 598, బి.హాసిత 595, కె.శ్రీవిద్య 582, ఎం.డి.అఫ్షాన్‌ఖాన్ 579, ఎస్.సాయిప్రతిజ్ఞ 573, ఎం.ప్రతిమ 571, పి.శ్రీనాథ్ 566, షేక్ ఉమ్రా 561, తేజస్విని 560, మహీ న్ నజ్మీన్ 560 మార్కులు సాధించారన్నారు. కె.సుహృదాఘ వ పి.డబ్ల్యుడి కేటగిరిలో జాతీయస్థాయిలో 675వ ర్యాంకు సాధించారన్నారు. నీట్ కోచింగ్‌లో డాక్టర్స్- 30 ప్రత్యేక ప్రోగ్రా మ్ ద్వారా కోచింగ్ అందించిన రెండో సంవత్సరంలో 10 మం ది విద్యార్థులకు 600లకు పైగా మార్కులు రాగా, 20 మందికి 560 ఆపై మార్కులు, 41 మందికి 500 పై మార్కులు, 86 మందికి 450పై మార్కులు సాధించడం విశేషమన్నారు. పటిష్ట ప్రణాళికతో విద్యా బోధన, నిరంతర పర్యవేక్షణ, అకుంఠిత దీక్షతో నీట్‌లో అద్భుత ఫలితాలు సాధిం చారని విద్యార్థులను,తల్లిదండ్రులను, అధ్యాపకులను నరేందర్‌రెడ్డి అభినందించారు.



అల్ఫోర్స్ కాలేజీలో నీట్ టాపర్స్‌ను అభినందిస్తున్న చైర్మన్ నరేందర్‌రెడ్డి

# 'శ్రీచైతన్య' విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

కరీంనగర్ టౌన్, జూన్ 5: నీట్-2024 ఫలితాల్లో స్థానిక శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి లో అద్భుత మార్కులు సాధించినట్లు కళాశాల డీన్ జగన్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముజామిల్ ఖాన్ 633, సిహెచ్.చందన 533, అజ్మీరా రాజు 530, మిట్ట సిరివెన్నెల 524, కాలబోయిన అర్జున్ 517, రెశ్వంత్‌రెడ్డి 510 మార్కులు సాధించారన్నారు. అలాగే 400లకు పైగా మార్కులను 15 మంది వి ద్యార్థులు సాధించడమే కాకుండా పరీక్షకు హాజరైన వారిలో 60శాతం మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారని తెలిపారు. అనునిత్యం పర్య వేక్షణ, నీట్ పరీక్ష నిర్వహించే వరకు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపడం వల్లనే విద్యార్థులు జాతీయ స్థాయిలో అద్భుత ఫలితాలు సాధించారన్నారు. బుధ వారం కళాశాలలో నీట్‌లో సత్తా చాటిన విద్యార్థులు వారికి సహకరించిన తల్లిదండ్రులను, శ్రీచైతన్య అధ్యాపక బృందాన్ని చైర్మన్ రమేశ్‌రెడ్డి అభినందించా రన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరు పతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, మోహన్ రావు, ఎంజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ రమేశ్‌రెడ్డి



















## 100 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ముత్తారం జూన్ 5: జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి పెద్దపల్లి జిల్లా కేంద్రానికి అక్రమంగా తరలిస్తున్న 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం తెల్లవారు జామున ముత్తారం మండలంలోని కాసర్ల గడ్డ వద్ద పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్నారని అందిన సమాచారం మేరకు సివిల్ సప్లై అధికారి మంథని రవీందర్ రాథోడ్ ముత్తారం గ్రామంలో ఒక వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాసింపల్లి గ్రామానికి చెందిన దుగ్యాల సమ్మయ్య కొంతకాలంగా తక్కువ రేటుకు రేషన్ బియ్యాన్ని గ్రామస్థుల దగ్గర కొని ఎక్కువ రేటుకు అమ్ముకొని లాభం పొందుతున్నాడు. అదే క్రమంలో బుధవారం అంబాల అనిల్‌కు చెందిన ఓ వ్యానులో రేషన్ బియ్యాన్ని పెద్దపల్లికి చెందిన ఆంజనేయులు, రాజు తరలిస్తుండగా సివిల్ సప్లై అధికారి ముత్తారం రోడ్డు వద్ద పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.


నిందితుల అరెస్టు చూపుతున్న సివిల్ సప్లై అధికారులు, పోలీసులు

## 'నీట్'లో ట్రినిటి విద్యార్థుల జయకేతనం



నీట్ ర్యాంకర్‌ను అభినందిస్తున్న ట్రినిటి అధినేత దాసరి మనోహర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, జూన్ 5: నీట్-2024 ఫలితాల్లో స్థానిక ట్రినిటి జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. బుధవారం నగరంలోని ట్రినిటి కళాశాలలో ట్రినిటి విద్యాసంస్థల ఫౌండర్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఛైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి నీట్‌లో జాతీయ స్థాయి ర్యాంకులను సాధించిన విద్యార్థులను అభినందించారు. ట్రినిటి విద్యార్థులు ముసాబ్ హుస్సేన్ 685 మార్కులు, బి.నిఖిల్ 681, సయ్యద్ ముజ కిర్ అలీ 676, ఎం.శశాంక్ 671, ఎ.ఆదిత్య 670, ఎ.కిరణ్ సింగ్ 667, పి.సందీప్ కుమార్ 665 మార్కులు, ఆర్.అజిత్ కుమార్ 657 మార్కులు, వివేక్ సిద్దార్థ్ 655 మార్కులు, ఎస్.మాళవిక 651 మార్కులు, ముజమ్మిల్ ఖాన్ 633 మార్కులు, వి.స్ఫూర్తి 599 మార్కులు, జె.కీర్తన 582 మార్కులు, వి.రాహుల్ 567 మార్కులు, సహరిష్ ఐమాన్ 558 మార్కులు, ఎన్.గంగశ్రీ 542 మార్కులు, ఆర్.ఆలేఖ్య 538 మార్కులు, ఎం. శ్రీజ 538 మార్కులు, పి.ప్రణయ్ 537 మార్కులు, సిహెచ్.విఘ్నేష్ 536 మార్కులు, ఈయేషా మహజబీన్ 535 మార్కులు, వై.అశ్లేష 532 మార్కులు, పి.శ్రీదీప 523 మార్కులు, హెచ్.కులకర్ణి 522 మార్కులు, సిహెచ్. సాయి మెహిత్‌రెడ్డి 507 మార్కులు, ఎస్‌కె గౌస్‌పాషా 505 మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో పటిష్టమైన ప్రణాళికతో, ఒత్తిడి లేని విద్యా విధానంతో ఈ ర్యాంకులు సాధించడం వీలైందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సి పాల్స్, అధ్యాపక బృందం ర్యాంకులు సాధించిన విద్యార్థు లు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


నిఖిల్ విష్ణు


సయ్యద్ అలీ


ఆదిత్య ఆనంద్


శశాంక్ మౌర్య

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

**వెండి, బంగారం ఆభరణాలు, రూ. లక్ష అపహరణ**

కోరుట్ల, జూన్ 5: పట్టణంలోని అనంద్‌గిరినగర్ ప్రాంతం లోని తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగినట్లు కాలనీవాసులు, పోలీసులు బుధవారం తెలిపారు. కాలనీకి చెందిన పందిరి మురళి - కవిత దంపతులు మంగళవారం సాయత్రం ఇంటికి తాళంవేసి మేడిపల్లి మండలంలో రాజలింగపేట గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటి తులుపులు తీసి ఉన్న విషయం గమనించిన చట్టు పక్కల వారు చోరీ జరినట్లు గుర్తించి వారికి సమాచారం అందించారు. సమాచారం అందుకు న్న కవిత కుటుంబ సభ్యులు వెంటనే ఇంటికి చేరుకుని చూడగా ఇంటి తాళం పగులకొట్టి ఉండి ఇంట్లో సామగ్రి చిందర వంద రగా పడి ఉంది. బీరువాలో చూడగా అందులో ని ఐదుతులాల వెండి, తులం బంగారు అభరణాలతో పాటు లక్ష నగదు అపరహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. దీంతో కాలనీవాసుల సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కిరణ్ కుమార్ తన సిబ్బంది తో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

## బస్సు ఢీకొని బాలుడి మృతి




జగిత్యాలరూరల్, జూన్ 5: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన మామిడాల మనీష్ (5) అనే బాలుడిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మోరపల్లి గ్రామానికి మామిడాల మనీష్ అనే బాలుడు గ్రామంలో దుకాణానికి వెళ్లాడు. పండ్లు కొనుక్కొని తిరిగి తన ఇంటివైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో రాయికల్ వైపు నుంచి జగిత్యాల వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు బాలుడిని ఢీకొట్టడంతో బస్సు వెనుక టైర్ కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి గంగన్న ఉపాధి నిమిత్తం సౌదీ వెళ్లగా తల్లి ఇంటి వద్దనే బాలుడితో కలిసి ఉంటుంది. మృతుడి తల్లి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాలుడి మృతికి కారణమైన వారిని శిక్షించి నష్టపరిహారం చెల్లించాలని సుమారు గంట పాటు రోడ్డుపైన మృతుడి బంధువులు ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ ఆలీఖాన్, ఎస్సై సధాకర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకుల మృతి


సృజన్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం, జూన్ 5: ఇబ్రహీంపట్నం మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామానికి చెందిన బైరి సృజన్(29) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాజేశ్వర్‌రావు పేట గ్రామానికి చెందిన బైరి సృజన్, జంగిటి శ్రీకాంత్‌లు ద్విచక్ర వాహనంపై రాజేశ్వర్‌రావుపేట నుంచి మెట్‌పల్లి వైపు వెళ్తున్నారు. మేడిపల్లి వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమణించి హుటాహుటిన మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఆసు పత్రిలో చికిత్స పొందుతూ బైరి సృజన్ మృతి చెందాడు. మరో యువకుడు శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటన స్థలాన్ని పోలీస్‌లు పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపారు.

### పొరండ్లలో మరో యువకుడు..

**జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల గ్రామ శివారులో కండ్లపల్లి సాయిరాజ్ (22) అనే యువకుడిని బుధవారం బొలెరో వాహనం వేగంగా ఎదురుగా వచ్చి బైక్‌ను బలంగా ఢీకొన్న సంఘటనలో రాయికల్ మండలం చింతలూర్ గ్రామానికి చెందిన సాయిరాజ్ అనే యువకుడికి తలకు బలమైన గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడని జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు సాయిరాజ్ తన ద్విచక్రవాహనంపై రాయికల్ మండలంలోని తన స్వగ్రామం చింతలూర్ నుంచి జగిత్యాలకు పని నిమిత్తం వెళ్తుండగా మార్గమధ్యలోని పొరండ్ల వద్ద ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. మృతుడు సాయిరాజ్ తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ అద్దెబస్సు

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), జూన్ 5: తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామ శివారులో ఆర్టీసీ అద్దెబస్సు బుధవారం అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. బస్సులో ఉన్న ప్రయాణికులు క్షేమంగా ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. సిద్దిపేట ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు బుధవారం తెల్ల వారుజామున 34 మంది ప్రయాణికులతో వేములవాడకు బయల్దేరింది. తంగళ్లపల్లి మండలం పద్మ నగర్ శివారులో డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపడంతో స్టీరింగ్ లాక్ పడింది. దీంతో బస్సు రోడ్డు పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి వెళ్లి ఆగిపోయింది. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో సురక్షితంగా బయటపడ్డారు. సంఘటన స్థలాన్ని పోలీసులు, ఆర్టీసీ అధికారులు పరిశీలించారు.

## అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి





రాయికల్, జూన్ 5: రాయికల్ పట్టణానికి చెందిన బైరి రాజశేఖర్ (65) మంగళవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. పట్టణానికి చెందిన రాజశేఖర్‌కు ఇద్దరు కుమారులున్నారన్నారు. ఈ కుటుంబానికి గత కొంతకాలంగా ఆస్తి పంపకాల గొడవలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలోనే ఈ నెల 4న రాత్రి రాజశేఖర్‌కు, పెద్ద కొడుకు నరేష్‌కు మధ్య వాగ్వాదం జరిగిందన్నారు. ఈ సమయంలో ఇరువురు ఒకరినొకరు పెనుగులాడుకున్నారని, ఈ పెనుగులాటలో రాజశేఖర్ అదుపు తప్పి కిందపడగా, అక్కడే కుప్ప కూలిపోయాడని ఎస్సై వివరించారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని, అయితే రాజశేఖర్ గుండె నొప్పితో చనిపో యి ఉండవచ్చని లేదా ఇతర కారణాల వల్ల మృతి చెంది ఉండవచ్చని మృతుని భార్య కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. అయితే రాజశేఖర్‌కు మూడేళ్ల క్రితం గుండె ఆపరేషన్ జరిగిందని కుటుంబీకులు తెలిపారని ఎస్సై వివరించారు.

## గల్ఫ్ నుంచి స్వగ్రామం చేరిన మృతదేహం

గంగాధర, జూన్ 5: మండలంలోని ఉప్పరమల్యాలకు చెందిన సందరగిరి రమేష్ (35) మే 10న దుబాయిలో మృతి చెందాడు. ఆయన మృతదేహం బుధవారం స్వ గ్రామానికి చేరింది. రమేష్‌ను ఓ ఏజెం టు 60 వేలు తీసుకుని విజిట్ వీసాపై దుబాయికి పంపించాడు. దుబాయిలో ఏడు నెలలు గడిచినా పని దొరకకపోవడంతో మానసింగా కృంగిపోయాడు. రెండు నెలల నుంచి పని లేక పోవడంతో మనస్తాపం చెందాడు. దీంతో ఆయ న ఆరోగ్యం దెబ్బతిన్న ది. తీవ్ర అనారోగ్యంతో మే 10న మృతి చెందాడు. ఆయన మృత దేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. రమేష్‌కు ఆరు లక్షల రూపాయల వరకు అప్పులున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.




















## కలెక్టర్‌కు రెవెన్యూ ఉద్యోగుల సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

జగిత్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషాను జిల్లా ట్రెస్మా జిల్లా అధ్యక్షుడు ఎండీ వకీలు నేతృత్వంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషాను పూలమాలలు, శాలువలు, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ హన్మంతరావు, ఎన్నికల సెల్ తహసీల్దార్ హకీం, సూపరెండెంట్ విశ్వంబర్, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ అనిల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి ప్రవాస భారతీయుల విరాళం

కొడిమ్యాల, జూన్ 5 : మండల కేంద్రంలో నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం కొడిమ్యాల గ్రామానికి చెందిన పలువురు ప్రవాస భారతీయులు మారుపాక సాయికృష్ణ, గుడిపెల్లి మహేష్ 30 వేల రూపాయలను విరాళంగా ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఏలేటి నర్సింహరెడ్డి, అధ్యక్షుడు రాచకొండ చంద్రమోహన్‌కు అందించారు. ఇట్టి రూపాయలను సింగపూర్‌లో ఉంటున్న బైరి రవి, చల్ల కృష్ణ, నల్లవెల్లి నరేందర్‌రెడ్డి, గుడిపెల్లి శ్రీనివాస్, చీకట్ల తిరుపతి, గుర్రం గంగాధర్, వి. చంద్రశేఖర్‌రెడ్డి, జి. రమేష్, మారుపాక అఖి, ఊటుకూరి శ్రీనివాసరెడ్డి, బైరి నిఖిల్ సమకూర్చారు. దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

కథలాపూర్, జూన్ 5 : ప్రభుత్వ బడుల్లో అన్ని రకాల ఉచిత వసతులు, నాణ్యమైన విద్య అందిస్తున్నామని తల్లిదండ్రులు తమ పిల్లలను బడిబాట పట్టించాలని ఉపాధ్యాయులు కోరారు. బుధవారం మండలంలోని ఊట్‌పల్లి, పెగ్గెర్ల గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. సర్కారు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, స్కూల్ యూనిఫాం వంటి సౌకర్యాలు అందిస్తున్నట్లు వివరించారు. కొత్తగా విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అర్జున్, హెచ్‌ఎంలు రాజయ్య, విష్ణు, రవి, శ్రీనివాస్ రెడ్డి, పరమేశ్వర్, నజీర్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

## భీమారంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భీమారం, జూన్ 5: భీమారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 17 సంవత్సరాల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సందడి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయుడు లింగారెడ్డి, ఉపాధ్యాయులు రాజరెడ్డి, శరత్, గంగాధర్, వెంకటేశ్వర్లు, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన గ్రామ స్థాయి క్రికెట్ పోటీలు

కోరుట్ల రూరల్, జూన్ 5: మండలంలోని పైడిమడుగు గ్రామంలో గత వారం రోజులుగా నిర్వహింస్తున్న పీసీఎల్ లీగ్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. వారంరోజులుగా మూడు జట్లు పాల్గొని ప్రతి జట్టు రెండు లీగ్ పోటీలలో పాల్గొన్ని ప్రతిభ కనపరిచినట్లు లీగ్ పోటీల నిర్వహకులు తెలిపారు. ఫైనల్ పోటీలలో ఎంబీఆర్ వారిస్, తిరుపతి 11 మధ్య జరుగగా తిరుపతి 11 జట్టు విజేతగా నిలిచినట్లు లీగ్ పోటీల నిర్వహకులు పేర్కొన్నారు. లీగ్‌లో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులకు నిర్వాహకులు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో టోర్ని నిర్వహకులు, గ్రామ మాజీ ప్రజాప్రతినిదులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేసుకోవాలి

ధర్మపురి, జూన్ 5: బ్యాంక్ ఖాతాదారులు ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేసుకోవాలని కేడీసీసీ ధర్మపురి బ్రాంచ్ మేనేజర్ శ్రీలక్ష్మీ కోరారు. బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామానికి చెందిన బ్యాంక్ ఖాతాదారుడు కుంబాల కాంతయ్య అనారోగ్యంతో మృతి చెందగా పీఎంజేజేబీవై ద్వారా మంజూరు చేసిన రూ. 2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును నామినీ అయిన భార్య జమునకు గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ ఫీల్డు ఆఫీసర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు పెగడపల్లి మండల సర్వసభ్య సమావేశం

పెగడపల్లి, జూన్ 5: పెగడపల్లి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 7న శుక్రవారం ఉదయం 11.30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీ గోళి శోభ అధ్యక్షతన నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

## జనసేన అభిమానుల సంబరాలు

రాయికల్, జూన్ 5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ భారీ మెజార్టీతో గెలువడంతో రాయికల్ పట్టణంలో జనసేన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో నిరుపేదలకు అన్నదానం చేశారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన జగిత్యాల ఇన్‌చార్జి బెక్కం గణేష్, రాయికల్ పట్టణ ఇన్‌చార్జి కాశవేణి మల్లిఖార్జున్‌పాల్గొన్నార

## బీజేపీ అభ్యర్థి వైపు ధర్మపురి నియోజకవర్గ ఓటర్లు

● కాంగ్రెస్ కన్నా బీజేపీ అభ్యర్థికి మెజార్టీ ఓట్లు

ధర్మపురి, జూన్ 5: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గల ధర్మపురి (ఎస్సీ) శాసనసభ నియోజకవర్గంలో మెజార్టీ ఓటర్లు బీజేపీ అభ్యర్థి వైపు నిలిచారు. ధర్మపురి శాసనసభ నియోజకవర్గం మినహా అన్ని నియోజకవర్గాల్లో ఎంపీగా గెలుపొందిన గడ్డం వంశీకృష్ణకు భారీ మెజార్టీ ఓట్లు వచ్చాయి. కేవలం ధర్మపురి నియోజకవర్గంలో మాత్రమే పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ మెజార్టీ ఓట్లు సాధించాడు. పార్లమెంట్ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గంలో మొత్తం 1,69,272 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు 57,633 ఓట్లు, బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌కు 66,221 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు 32,075 ఓట్లు, నోటాకు 538 ఓట్లు, మిగతా ఓట్లు ఇతర అభ్యర్థులకు లభించాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌కు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ కన్న 8,588 ఓట్లు అధికంగా లభించాయి.

## శాసనసభకు కాంగ్రెస్.. లోక్‌సభకు బీజేపీ

● మల్యాల మండలంలో ఓటర్ల తీర్పు

మల్యాల, జూన్ 5: లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో మండలంలో బీజేపీ సత్తా చాటింది. అత్యధిక గ్రామాల్లో ఆ పార్టీ అధిక ఓట్లు సాధించింది. అయితే ఆరు నెలల క్రితమే జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటగా ఇప్పుడు లోక్‌సభ ఫలితాల్లో బీజేపీ అత్యధిక ఓట్లు సాధించింది. మండలంలో శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి 6,344, కాంగ్రెస్‌కు 12,227, బీఆర్ఎస్‌కు 9,439 ఓట్లు లభించగా కాంగ్రెస్ 2,788 మెజార్టీ సాధించింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 17,210, కాంగ్రెస్‌కు 6,620, బీఆర్ఎస్‌కు 4,148 ఓట్లు లభించాయి. దీంతో బీజేపీకి రెట్టింపుకన్నా ఎక్కువగా ఓట్లు రాగా 10,590 మెజార్టీ సాధించింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ గతంలో కన్నా సగానికి ఓట్లు కోల్పోయాయి.

# నత్తనడకన అమ్మ ఆదర్శ పాఠశాల పనులు

● పాఠశాలలు ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం ● చాలా చోట్ల ప్రారంభ దశలోనే..



మల్యాలలో నీటి సంప్ కోసం తవ్విన గుంత



తాగునీటి కోసం ఏర్పాటు చేస్తున్న కుళాయిలు

మల్యాల, జూన్ 5: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు, పాఠశాలల మరమ్మతుల కోసం ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా వీవోల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. విద్య సంవత్సరం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలనే ప్రభుత్వ ఆదేశాలు అమలు అయ్యోల లేవు. ఇప్పటి వరకు సగం ఆపై మాత్రమే పనులు పూర్తి అయ్యాయి. మల్యాల మండలంలో 26 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.2కోట్ల 41లక్షల 94వేల అంచనా వ్యయంతో వసతుల కల్పనకు పనులు చేపట్టారు. ఇందులో భాగంగా పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, టాయిలెట్స్, చిన్న, పెద్ద తరహా పనులు, పాఠశాల మరమ్మతుల పనులు చేపట్టారు. అయితే ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. మరో వారం రోజుల్లో పాఠశాలు ప్రారంభం కానుండగా పనులు కొనసాగుతుండడంతో విద్యార్థులకు అసౌకర్యంగా మారే అవకాశం ఉంది. ఇప్పటికీ సగం పాఠశాలల్లో పనులు ప్రారంభ దశలోనే ఉన్నాయి. ఇలాగైతే పాఠశాలల ప్రారంభంలోపు పనులు పూర్తయ్యే అవకాశాలు లేవు. గత గురువారం కలెక్టర్ షేక్ యస్మీన్‌భాషారాజారం పాఠశాలలో పనులను పరిశీలించారు. వేగవంతం చేసి పాఠశాలల ప్రారంభం వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారుల నిర్లక్ష్యానికి తోడు పనులను అధికార పార్టీకి చెందిన నాయకులు చేయడంతో పనులు నెమ్మదిగా సాగుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

### పనులు ప్రగతిలో ఉన్నాయి

ఇబ్రహీం, ఏఈ, పంచాయితీ రాజ్

అన్ని పాఠశాలల్లో పనులు ప్రగతిలో ఉన్నాయి. సగానికి పైగా పనులు పూర్తి అయ్యాయి. వేసవి ఎండల తీవ్రతతో కూలీల కొరత నెలకొని పనులకు కాస్తా ఆటంకం ఏర్పడింది. పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేస్తాం. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటాం

## నీట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు



హిమద్యుతి



కీర్తన



హరీష్‌బాబు

రాయికల్, జూన్ 5: రాయికల్ మండ లానికి చెందిన ఇద్దరు విద్యార్థులు బుధవారం వెలువడిన నీట్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. రాయికల్ పట్టణానికి చెందిన జక్కుల కీర్తన 720 మార్కులకు 582 మార్కులు సాధించి ఆలిండియా స్థాయిలో 1,01,268వ ర్యాంక్, ఓబీసీ కేటగిరీలో 48,085వ ర్యాంక్ సాధించింది. అలాగే వీరాపూర్ గ్రామానికి చెందిన చెవలి హరీష్‌బాబు 720 మార్కులకు 523 మార్కులు సాధించి ఆలిండియా స్థాయిలో 1,76,284వ ర్యాంక్, ఓబీసీ కేటగిరీలో 83,637వ ర్యాంక్ సాధించాడు. దీంతో వీరిని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

**ధర్మపురి** : ధర్మపురి పట్టణానికి చెందిన మదిరె హిమద్యుతి అనే విద్యార్థి నీట్‌లో అల్ ఇండియా స్థాయిలో 27,341 ర్యాంక్ సాధించింది. ధర్మపురి పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు చిలువేరి ఉమాదేవి కూతురు హిమద్యుతి కరీంనగర్ ఆల్‌ఫోర్స్ కళాశాలలో ఇంటర్ చదివి 500 మార్కులకు 452 మార్కులు సాధించింది. ఈ విద్యార్థి ఓబీసీ కేటగిరిలో 12,285 ర్యాంకు సాధించింది. ఈ విద్యార్థిని పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

## టీడీపీ నాయకుల సంబరాలు

కోరుట్ల, జూన్ 5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టీడీపీ మిత్ర పక్షాలు ప్రభుత్వం ఏర్పాటును స్వాగతిస్తూ బుధవారం పట్టణ తెలుగు తమ్ముళ్లు సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని తెలుగుదేశం కార్యాలయంతో పాటు పట్టణంలోని వివిధ ప్రదాన కూడలీలలో పార్టీ నియోజకవర్గ ఇంచార్జ మానుక ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో టపాసులను పేల్చి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు గజ్జెలి గణేష్, ఎండి రఫీ, కటకం మహాదేవ్, బాదం మోహన్, బాలే మారుతి, అంజయ్య, సిద్దు, ఆసిఫ్, శంకర్, రాజేష్, చిలివేరి మహేశ్వరి, విజయ్, రాణి, దివ్య, లలిత, సదుమాసుల శాంత, జ్యోతి, లలితలతో పాటు పలువురు పాల్గొన్నారు.

● మెట్‌పల్లి : పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో నిజామాబాద్ పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం నాయకులు టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఏపీలో కూటమి విజయం సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జరిపోతూల చందు, ఎండీ సాదుల్లా, కోఫూరి వెంకట్రావు, పోతాని సత్యం, మచ్చ లక్ష్మీపతి, తన్నీరు శ్రీనివాస్, లింగంపల్లి మహేష్, గుంజ శ్రీనివాస్, నరసింహ, బంగారు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

● రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ పార్లమెంట్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సోమ నారాయణ రెడ్డి, అనుపురం చిన్న లింబాద్రి గౌడ్, గోనె భూమేశ్వర్, సురకంటి చిన్న రాజరెడ్డి, ఎండీ సాహెబ్ హుస్సేన్, మన్నెం వీరయ్య, కొక్కు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నాయకుల సంబరాలు



జగిత్యాలలో సంబరాలు చేస్తున్న బీజేపీ నాయకులు



మెట్‌పల్లిలోని పాతబస్టాండ్ చౌరస్తాలో బీజేపీ సంబరాలు

జగిత్యాల అర్బన్, జూన్ 5: దేశంలో, రాష్ట్రంలో ఎవరెన్ని కుట్రలు చేసినా బీజేపీ అధికారంలోకి రానుందని, ప్రధానిగా మూడోసారి నరేంద్ర మోదీ పగ్గాలు చేపడతారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణరావు అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద కరీం నగర్, నిజామాబాద్ ఎంపీ స్థానాలు గెలవడంతో పాటు, మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం, ప్రధానిగా మోదీ హ్యాట్రిక్ సాధించడం పట్ల శ్రేణులు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబరాలు నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు మాట్లాడుతూ హ్యాట్రిక్ ప్రధానిగా పగ్గాలు చేపట్టనున్న మోదీకి, కరీంనగర్, నిజామాబాద్ ఎంపీలుగా గెలుపొంది న బండి సంజయ్, అర్వింద్ ధర్మపురిలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుతూ రుణపడి ఉంటామన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి మాట్లాడుతూ రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న మూడోసారి కూడా అధికారంలోకి వచ్చేలా ఆశీర్వదించిన ఓటరు మహాశయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

**మెట్‌పల్లి** : నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడుగా రెండో సారి ధర్మపురి అరవింద్ విజయం సాధించడంతో మెట్‌పల్లిలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బుధవారం పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో పార్టీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్ ఆధ్వర్యంలో నాయకులు బాణసంచా పేల్చి, ప్రజలకు, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లి పట్టణంలో బీజేపీకి 7000లకు పైచిలుకు మెజార్టీ రావడం ఎంతో సంతోషాన్ని కలిగించిదన్నారు. బీజేపీ కోరుట్ల నియోజక వర్గం కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్ మాట్లాడుతూ బీజేపీకి అండగా నిలిచి ఓటు వేసిన నియోజకవర్గంలోని ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వడ్డేపల్లి శ్రీనివాస్, నాయకులు దొనికేల నవీన్, చెట్లపల్లి మీనా, మర్రి పోచయ్య, గంప శ్రీనివాస్, బోడ్ల నగేష్, గుంటుక సదాశివం, సుంకేటి విజయ్, కుడుకల రఘు, బోడ్ల ఆనంద్, చెట్లపల్లి సత్యనారాయణగౌడ్, బోడ్ల నరేష్, నూనె క్రాంతికిరణ్, రమేష్ యాదవ్, సత్యనారాయణ, కృష్ణమూర్తి, శ్రీకాంత్, గంగానర్సయ్య పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొండగట్టులో ఎమ్మెల్యే సత్యం పూజలు

కొడిమ్యాల, జూన్ 5 : మండల కేంద్రంలోని అంగడి బజారులో బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. తిప్పయ్యపల్లిలో మాజీ సర్పంచు మ్యాకల లత మల్లేశంయాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే సత్యం జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌వీప్రసాద్ కంటి ఆసుపత్రి వారు మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం, మండలంలోని నాచుపల్లి గ్రామంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, టీపీసీసీ కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెజిడెంట్ జీవన్‌రెడ్డి, ఎంపీపీ స్వర్ణలత, సీనియర్ నాయకులు, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రసాద్, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, ఎంపీటీసీలు రాజేశ్వరీరాజేందర్, లక్ష్మన్, సింధు మహేందర్‌గౌడ్, మాజీ సర్పంచు లతమల్లేశం యాదవ్, నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, తిర్మలేష్, అజయ్‌గౌడ్, సతీష్, శంకర్ పాల్గొన్నారు.

### అంజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే

మల్యాల : చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం తన జన్మదినం సందర్భంగా కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదినం సందర్భంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మల్యాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 53 మంది యువకులు రక్తదానం చేసినట్లు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రవళి, విండో చైర్మన్ రాం లింగారెడ్డి నాయకులు పాల్గొన్నారు. అనంతరం సోనియాగుడి వద్ద యువజన కాంగ్రెస్ నాయకులు మొక్క నాటారు.

● మల్యాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు యాగండ్ల సుమన్‌గౌడ్ ఆధ్వర్యంలో టీఆర్ నగర్‌లో గల శ్రీగాయత్రి విశ్వకర్మ ఆనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు.

## మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి సహకరించాలి

కొడిమ్యాల, జూన్ 5: మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి సంఘ సభ్యులు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా అధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి చిట్ల రమణ, కార్యవర్గ సభ్యులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర మున్నూరు కాపు సంఘ భవనానికి వారు రాగా మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం నాయకులు, సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ నెల 9న జిల్లా కేంద్రంలోని బీఎల్ఎన్ఎల్ గార్డెన్‌లో నిర్వహించనున్న మున్నూరు కాపు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి మున్నూరు కాపు సంఘాల సభ్యులు రావాలని కోరారు. సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని అన్నారు. సంఘం మున్నూరు కాపుల అభివృద్ధికి అన్ని వేళలా కృషి చేస్తుందన్నారు.

ఈ సమావేశంలో తిర్మలాపూర్ సింగిల్ విండో చైర్మన్ పోలు రాజేందర్, కొడిమ్యాల మండల మున్నూరు కాపు సంఘం నాయకులు రాజిరెడ్డి, రత్నాకర్, భూమయ్య, వెంకన్న, విజయ్, సుధాకర్, ఓంకార్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలి



లక్ష్మీపూర్‌లో ర్యాలీ తీస్తున్న జడ్పీ సీఈవో రఘువరణ్



రామకిష్టాపూర్‌లో ర్యాలీ నిర్వస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్, జూలై 5: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడడంలో భాగస్వాములు కావాలని జడ్పీ సీఈవో రఘువరణ్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్, కల్లెడ, లక్ష్మీపూర్ గ్రామాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకొని పచ్చదనం, పరిశుభ్రత వారోత్సవాల్లో భాగంగా లక్ష్మీపూర్ గ్రామంలో జడ్పీ సీఈవో రఘువరణ్ ర్యాలీ తీసి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటారు. జడ్పీ సీఈవో మాట్లాడుతూ ఇంట్లో పిల్లలకు ప్రతి రోజు మొక్కలకు నీళ్లు పోసే విధంగా అలవాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ రవిబాబు, ఏపీఓ గంగాలక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

● పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సీడీపీఓ వీరలక్ష్మీ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్, అంతర్గాం, ఒడ్డెర కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచపర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, జానకి, సెక్రటరీ ప్రవీణ్, అంగన్‌వాడీటీచర్లు స్రవంతి, దయావతి పాల్గొన్నారు.

● పెగడపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో బుధవారం పర్యావరణంపై అవగాహన ర్యాలీలు , మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, మంజుల, పిటీసీ స్వామి, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



కోరుట్ల మండలంలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు

● కొడిమ్యాల: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక అధికారులు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో స్వరూప మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలుగు అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిపించారు. అంతకు ముందు మొక్కలను నాటారు. ఇంటింటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. ఈ నెల 12 వరకు క్లీన్ అండ్ గ్రీన్ వారోత్సవాలు చేయాలన్నారు. ఈ ర్యాలీలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● కోరుట్ల రూరల్ : మండలంలోని వివిధ గ్రామాలలో బుధవారం గ్రామస్థాయి అధికారులతో కలిసి ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. గ్రామాలలో చెట్లు నాటి పర్యవరణం కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్థాయి అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● కథలాపూర్ : పుడమిపై విరివిగా మొక్కలు నాటితేనే పర్యావరణ సమతుల్యతకు అవకాశం ఉంటుందని ఎంపీఓ ప్రవీణ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వివిధ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి మొక్కలు నాటారు. ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని, వ్యర్థాలను ఊరిబయట పడేయాలని సూచించారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

● మెట్‌పల్లి రూరల్ : పర్యవరణ సంరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి భావితరాలకు రక్షణ కల్పించాలని పంచాయతీ కార్యదర్శి నిజాముద్దీన్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు, ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించి మొక్కను నాటి, చెట్లను నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని వారిచే కార్యదర్శి నిజాముద్దిన్ ప్రతిజ్ఞ చేయించారు.